అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

- ఆ ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదే
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఈపూరు : ఇచ్చిన మాటకు కట్టుబడి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదే అని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని కొండాయపాలెం గ్రామ సచివాలయం పరిధిలో గల బొగ్గరం గ్రామంలో 2వ రోజు శనివారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని ప్రతి ఇంటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రతి విషయంలో రాజకీయం చేశారని, వారు ఇచ్చిన సంక్షేమ పథకాలు కూడా పార్టీలు చూసి ఇవ్వడం, గ్రామాల్లో వేయాల్సిన సిమెంటు రోడ్లు వాళ్ల పార్టీకి అనుకూలంగా ఉన్నవారి ప్రాంతాల్లో వేయడం జరిగిందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ఈ గ్రామానికి సంక్షేమ పథకాల ద్వారా రూ.10.11 కోట్లు లబ్ధిదారులకు అందాయని, అభివృద్ధి పథకాల ద్వారా రూ.2.90 కోట్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. బొగ్గరం గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు, టీడీపీ నాయకుల నైజమని, గత ఎన్నికల్లో రుణమాఫీ అని చెప్పి మోసం చేసిన గెలిచిన తరువాత సక్రమంగా రుణమాఫీ చేయకుండా ప్రజలను గాలికి వదిలేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు తుర్లపాటి చౌదయ్య, మండల పార్టీ అధ్యక్షులు కోపెల దేవరాజ్, పార్టీ నాయకులు శాకమూరి బుచ్చయ్య, గోనుగుంట్ల వెంకటహనుమయ్య, మందపాటి రామారావు, ఎం. అంజయ్య, దుద్దుగుల జానయ్య, విద్యుత్ ఏడీఏ వెంకటేశ్వరరెడ్డి, తహసీల్దార్ విజయజ్యోతికుమారి పాల్గొన్నారు.

చేసిన మేలు చెప్పేందుకు వస్తున్నాం



లబ్ధిదారులకు క్యాలెండర్ అందజేస్తున్న మంత్రి విడదల రజిని

- ప్రజారంజక పాలనతో చరిత్ర
- మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక చేసిన మేలు చెప్పేందుకే ప్రజల్లోకి సగర్వంగా వెళుతున్నామని వైద్య, ఆరోగ్యశాఖమంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని 34వ వార్డు పరిధిలోని సుగాలీకాలనీలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముందుగా డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ఇచ్చిన హామీలను సమర్థవంతంగా అమలు చేసి ధైర్యంగా ప్రజా బ్యాలెట్‌ను గడపగడపకు అందజేస్తున్నామని తెలిపారు. సీఎం స్థానంలో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనే మహోన్నత వ్యక్తి ఉండబట్టే ఇది సాధ్యమైందని వివరించారు. ఇచ్చిన మాట పల్లెత్తుపోకుండా ఒక్కో హామీని నెరవేర్చుకుంటూ తమప్రభుత్వం వస్తోందని తెలిపారు. ఇప్పటికే 98 శాతానికి పైగా హామీలను నెరవేర్చగలిగామని చెప్పారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వార్డు కౌన్సిలర్ వడితె కోట్యానాయక్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, నాయకులు పాల్గొన్నారు.

జగనన్న హయాంలో వ్యవస్థలకు మహర్దశ

- విద్యా, వైద్యం, వ్యవసాయానికి పెద్దపీట
- పదో వార్డు గడపగడపలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



లబ్ధిదారులకు పథకాల వివరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: రాష్ట్రంలోని వ్యవస్థలన్నింటినీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి బాగుచేసి సక్రమంగా నడిపిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. విద్యా, వైద్యం, వ్యవసాయానికి అగ్రపీఠమేసి సుపరిపాలన అందజేస్తున్నారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం పదో వార్డులో ప్రకాష్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్ వెనుకవైపు రెండోరోజు పర్యటించారు. పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యేకు వార్డు మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి, బి.రామకృష్ణంరాజు, జూపల్లి శ్రీనివాసరావు, టౌన్ కన్వీనర్ల ఇన్‌చార్జి మద్దిరెడ్డి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఇప్పటి వరకు ప్రతి గృహానికి అందుతున్న సంక్షేమ పథకాలను గురించి తెలియచేస్తూ వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను అందజేశారు. వారు చెబుతున్న సమస్యలను వింటూ వారి మనోభావాలను తెలుసుకున్నారు. పదో వార్డు సచివాలయానికి వచ్చిన ఎమ్మెల్యేను ఉద్యోగులు, వలంటీర్లు సన్మానించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులు, బడుగు, బలహీనులు, పింఛన్ తీసుకుంటున్న పెద్దవారు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. ఏపీ బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, న్యాయవాదులు బోయిన పిచ్చేశ్వరరావు, అరెకూటి శ్రీనివాస రెడ్డి, చాంబర్ అధ్యక్షులు కొత్తూరి కిషోర్‌కుమార్, సీనియర్ నాయకులు బోయిన సుబ్బారావు, సంరక్ష సొసైటీ కార్యదర్శి బీఆర్ సుశీల్‌కుమార్, వార్డు నాయకులు కె.రోశిరెడ్డి, డి.అంకిరెడ్డి, టి.వీరారెడ్డి, వి.పెద్దిరెడ్డి, సీహెచ్.పిచ్చిరెడ్డి, షేక్.అలీమియా, పి.శ్రీనివాస రెడ్డి, డి.జ్యోతి, సుకన్య, అనూరాధ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్తమ ఫలితాలు సాధించాలి

చిలకలూరిపేటటౌన్: పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని పల్నాడు జిల్లా డీఈవో ఎం.వెంకటప్పయ్య చెప్పారు. శనివారం ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ ప్రాంగణంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవోలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించాలి

శావల్యాపురం: ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పథకంలో అర్హులైన వారికి లబ్ధి చేకూరలంటే తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేయించాలని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు శనివారం తెలిపారు. ఈనెల ఖారులోగా 13వ విడత పీఎం కిసాన్ పథకం నగదు రైతుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లోకి కేంద్ర ప్రభుత్వం జమ చేస్తుందన్నారు.

రీసర్వే పనులు నూరుశాతం పూర్తి

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి రెవెన్యూ గ్రామంలో డ్రోన్, వోఆర్‌ఐ ఛాయాచిత్రాలు, రోవర్ ఆధునిక యంత్ర పరికరాలతో రీసర్వే పనులు నూరుశాతం పూర్తి చేసినట్లు తహసీల్దారు షేక్ జాన్‌సైదులు తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు మాట్లాడుతూ శావల్యాపురం, కనమర్లపూడి రెండు గ్రామాల్లో 3531.89 ఎకరాల విస్తీర్ణం కలిగిన భూములన్నీ రీసర్వే పనులు రైతుల సమక్షంలో పారదర్శకంగా చేశామన్నారు.

బాలుడి అపహరణ



నరసరావుపేట టౌన్: పట్టణంలోని రామిరెడ్డిపేట స్టేట్‌బ్యాంకు కాలనీ రెండోలైన్‌లో నివాసం ఉండే బండి వాసు, సాయిలక్ష్మి దంపతుల పది నెలల బాలుడు ప్రకాష్‌ను శనివారం కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఇంటికి వచ్చి అపహరించుకుపోయారు. శుక్రవారం చిక్కు వెంట్రుకలు కొనడానికి ఇంటికి వచ్చి,రెక్కీ నిర్వహించి ఇంటిలో పరిస్థితులు గమనించి చిక్కు వెంట్రుకలు కొనకుండా వెళ్ళిపోయారు. ఇద్దరు వ్యక్తులు ఇంటిముందు ఆడుకుంటున్న బాలుడును ఆటోలో తీసుకుపోయారు. బాలుడు క్షణాల్లో మాయమవడంతో తల్లిదండ్రులు తల్లడిల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వన్ టౌన్ సీఐ అశోక్‌కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. బాబు ఆచూకీ తెలిసిన వారు 99865 74992 ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

హస్తకళలకు ఎనలేని ప్రోత్సాహం



గణపవరంలో స్థానికులు నేసిన పట్టు చీరలను పరిశీలిస్తున్న విజయలక్ష్మి

నాదెండ్ల: హస్తకళల ఉత్పత్తులకు మంచి మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించి కళాకారులకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో చేయూతనందిస్తున్నారని ఏపీ హ్యాండీ క్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి చెప్పారు. గణపవరంలో భద్రావతి సమేత భావనారుషి కలశ మహోత్సవ వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో హస్తకళల ఎంపోరియంలు 17 ఉన్నాయని, ముఖ్యంగా మన రాష్ట్రంలోని 14 ఉన్నాయన్నారు. హస్త కళలైన కళంకారీ, తోలుబొమ్మలాట, ఉడ్ క్వారీయింగ్, కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, తుంగచాపలు తయారు చేసే వారికి ఆర్థిక చేయూతనందించటమే కాక, కళారూపాలకు మంచి మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. నేతన్నలను ఆదుకునేందుకు ప్రతి జిల్లా కేంద్రంలో వైఎస్సార్ హ్యాండీ క్రాఫ్ట్ బజార్లు ఏర్పాటు చేసి వారికి కౌంటర్‌లు అందుబాటులో ఉంచుతామన్నారు.
వీటితో పాటూ మహిళా గ్రూపులకు కూడా మార్కెటింగ్‌లో అవకాశం కల్పిస్తున్నామన్నారు.ఈ సందర్భంగా గణపవరంలో చేనేత కార్మికులు నేసిన పట్టు చీరలను పరిశీలించారు.

నేడు కార్యవర్గ ప్రమాణస్వీకారం

కమిటీ అధ్యక్షుడిగా తోట రాజేంద్రప్రసాద్



చిలకలూరిపేట: చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం సాయంత్రం 5గంటలకు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో నిర్వహించనున్నారు. నూతన కార్యవర్గాన్ని ఖరారు చేస్తూ ఇటీవలే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం కమిటీ గౌరవ చైర్మన్‌గా స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని వ్యవహరిస్తారు. చైర్మన్‌గా పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది తోట రాజేంద్ర ప్రసాద్, వైస్ చైర్మన్‌గా మానుకొండ శ్రీనివాస వీరారెడ్డి నియమితులయ్యారు. పాలక మండలి సభ్యులుగా మెట్టు రమాదేవి, కోయల మూడి అరుణ, జాష్టి పార్వతి, పమిడి శైలజ, గోరంట్ల బాపారావు, షేక్ గని, గుడికందుల వెంకటరత్నం, బందారు దాసు, దావల రత్నకుమారి, దేవరకొండ నాగేశ్వరరావు, సింగిరేసు పోలయ్య, పెరుమాళ్ల వెంకట సత్యనారాయణరావు, తోట గీతారాణి ప్రమాణస్వీకారం చేస్తారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు ప్రాంగణంలో సభ నిర్వహించనున్నారు. ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించేందుకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

ఆకట్టుకున్న రాష్ట్రస్థాయి మెగా చిత్రకళాప్రదర్శన



చితకళా ప్రదర్శనలోని చిత్రాలను తిలకిస్తున్న ముఖ్యఅతిథులు

వినుకొండ(నూజెండ్ల): బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వినుకొండ పట్టణంలోని లయోలా ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి మెగా చిత్రకళా ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. ఈ చిత్రకళా ప్రదర్శనలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి విచ్చేసిన 70మంది జాతీయ, అంతర్జాతీయ చిత్రకారులు గీసిన 200 కళా ఖండాలను ప్రదర్శించారు. ఈ చిత్రాలు ప్రజలను, విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిత్రకళా రంగంలో అంతర్జాతీయ రికార్డులు, అవార్డులు సాధించిన సి.కోటేష్ (నంద్యాల) కళా ఖండాలు విద్యార్థులను విశేషంగా ఆకర్షించాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు సాధించిన స్థానిక చిత్రకారులు వజ్రగిరి జెస్టిస్ చిత్రాలు, అతను నిర్వహించిన లైవ్ ఆర్ట్ డెమో విద్యార్థులు, ప్రజలు చాలా ఆసక్తితో తిలకించారు. పెదకూరపాడుకు చెందిన కంచర్ల జాన్‌బాబు ప్రపంచంలో ఎన్నో దేశాల నుంచి సేకరించిన కరెన్సీ, నాణెల ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు, వినుకొండ, శావల్యాపురం ఎంపీపీలు పగడాల వెంకటరామిరెడ్డి, ముండ్లమూరి అనిల్‌కుమార్, వార్డు కౌన్సిలర్లు షేక్ షకీలా, ఎంఎస్‌కే బాషా, రెడ్డి నాగపద్మ, నంది నరసింహారావు, గంధం కోటేశ్వరరావు, లయోలా హైస్కూల్ హెచ్‌ఎం ఫాదర్ రవి, సుపీరియర్ ఫాదర్ జ్ఞానదేవ్, ప్రముఖ న్యాయవాది పి.జె. లూకా, ఎంఈవో జక్రుల్లా, మద్దుకూరి ఫౌండేషన్ అధ్యక్షులు మద్దుకూరి అశోక్, కేక్ మిత్రమండలి అధ్యక్షులు కట్ట కోటేశ్వరరావు, అర్చనామూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే రేషన్ బియ్యం పంపిణీ

- ఇంటివద్దకే రేషన్ బియ్యంతో వినియోగదారుల సంఖ్య పెరిగింది
- ఎండీయు వాహనాల ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



పట్టణంలో ర్యాలీ చేస్తున్న ఎండీయు వాహనాల శ్రేణి

నరసరావుపేట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక వాహనాల (ఎండీయు)ద్వారా చేపట్టిన ఇంటివద్దకే రేషన్ బియ్యం పథకం గొప్ప విజయవంతమైందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఎండీయు వాహనాలను ప్రవేశ పెట్టి రెండేళ్లు అయిన సందర్భంగా ఆ నియోజకవర్గంలోని వాహనాల ఆపరేటర్లు శనివారం ప్రకాష్ నగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి కేకును కట్ చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. వాహనాల ప్రదర్శనకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ ఇళ్లవద్దకే రేషన్‌బియ్యం పంపిణీచేస్తుండటంతో బియ్యం తీసుకునే వారి సంఖ్య విపరీతంగా పెరిగిందన్నారు. గతంలో మాదిరిగా లబ్ధిదారులు పడే ఇబ్బందులకు సీఎం జగన్ చెక్ చెప్పారన్నారు. ఇది ఒక మంచి కార్యక్రమమన్నారు. దీనికి కృషిచేస్తున్న ఆపరేటర్లను అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

రీ-సర్వేకు పట్టణవాసులు సహకరించాలి

పట్టణంలో రీసర్వేపై ప్రజలకు అవగాహన



తొమ్మిదో వార్డు సచివాలయంలో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న అధికారులు

నరసరావుపేట: పట్టణంలో నిర్వహించే రీసర్వేకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్ర కోరారు. రాష్ట్రంలోని అన్నీ గ్రామీణ, పట్టణంలోని వ్యవసాయ భూములు, నివాస ప్రాంతాలను రీ-సర్వే నిర్వహించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పురపాలకసంఘ పరిధిలోని 9,10,11,12,13,14 సచివాలయాల్లో శనివారం ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ మోహనరావు, టౌన్ సర్వేయర్ శ్రీనివాసరావు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అనూరాధ పాల్గొన్నారు.

బీఎల్‌వోలు 18ఏళ్లు నిండిన వారందరినీ ఓటర్లుగా చేర్చాలి

బూత్‌లెవెల్ అధికారులు 18 ఏళ్లు నిండిన వారందరినీ ఓటర్లుగా చేర్చాలని పట్టణ, మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారులైన మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్ర, తహసీల్దార్ ఆర్‌వీ రమణా నాయక్ కోరారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశపు హాలులో బి.ఎల్.ఓలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మున్సిపల్ కమీషనర్ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అనూరాధ, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

150 కేసులు నమోదు

నరసరావుపేట: నియోజకవర్గంలోని పలుచోట్ల శనివారం విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి 150 కేసులు నమోదు చేసి రూ.4.81 లక్షలు అపరాధ రుసుం కింద వసూలు చేశారు. స్థానిక అధికారులతో కలిసి గుంటూరుకు చెందిన విజిలెన్స్ అధికారులు 24 బృందాలుగా ఏర్పడి దాడులు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీటీఎస్ వింగ్ సీఐ, డీపీఇ వింగ్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, నరసరావుపేట ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పాల్గొన్నట్లు డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.ఏడుకొండలు వెల్లడించారు.

బాల్‌బ్యాడ్మింటన్ విజేత జెఎంజే

నరసరావుపేట రూరల్: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల మహిళా బాల్‌బ్యాడ్మింటన్ పోటీల విజేతగా తెనాలి జెఎంజె ఉమెన్స్ కళాశాల నిలిచింది. ద్వితీయ స్థానాన్ని ఎంఏఎం ఫార్మసీ కళాశాల కైవసం చేసుకుంది. రెండురోజుల పాటు కేసానుపల్లి ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన వర్సిటీ అంతర కళాశాలల మహిళా బాల్ బ్యాడ్మింటన్ పోటీలు శనివారంతో ముగిసాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల నుంచి 12జట్లు పోటీలో పాల్గొన్నాయి. పోటీలలో యూనివర్సిటి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యూకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ ఆచార్య నాగార్జున యూనివర్సిటి, నాల్గవ స్థానంలో ధనలక్ష్మీ ఫిజికల్ ఎడ్యూకేషన్ కాలేజ్ జట్లు నిలిచాయి. పోటీలకు సెలక్షన్ కమిటి సభ్యులుగా వ్యాయామ అధ్యాపకులు జెపిఎంఆర్ నీలాకుమారి, డాక్టర్ సిహెచ్ వెంకట్రావు, డాక్టర్ కె.అరుణసుజాతలు వ్యవహరించారు. పోటీలు అనంతరం వర్సిటి జట్టును ఎంపిక చేసారు. చెన్నైలో ఈనెల 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరగనున్న అంతర యూనివర్సిటి పోటీల్లో వర్సిటి జట్టు పాల్గొంటుందని కళాశాల కార్యదర్శి ఎంవి శేషగిరిరావు తెలిపారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్ నెల్లూరు రమేష్, దరువూరి పృద్వీలు పాల్గొన్నారు. క్రీడాస్ఫూర్తిని విద్యార్థులు అలవర్చుకొని జీవితంలో ఉన్నత స్థానాలను సాధించాలని వారు ఆకాంక్షించారు.

తప్పిపోయి.. పేట చేరిన వృద్ధురాలు

- స్పందించిన సచివాలయ ఉద్యోగులు
- మతిస్థిమితం లేక బాబాపేటకు చేరుకున్న వైనం
- బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెం వాసిగా గుర్తింపు



వివరాలు సేకరిస్తున్న మహిళా పోలీసు, వెల్ఫేర్ సెక్రటరీ

నరసరావుపేట: మతి స్థిమితంలేని ఓ వృద్ధురాలిని సచివాలయ ఉద్యోగులు గమనించి తిరిగి బంధువుల చెంతకు చేర్చిన సంఘటన శనివారం పట్టణంలోని ఆరో వార్డు పరిధిలో చోటుచేసుకుంది. ఆరోవార్డు బాబాపేటలో రెండు రోజుల నుంచి మతిస్థిమితంలేక ఓ వృద్ధురాలు పడిఉంది. ఈ విషయం గమనించిన స్థానికులు సచివాలయంలోని వెల్ఫేర్ సెక్రటరీకి సమాచారం అందజేశారు. దీనిపై సచివాలయ అడ్మిన్ షేక్ సమీర్ ఆదేశాల విజ్ఞప్తి మేరకు వెల్ఫేర్ సెక్రటరీ అమీరున్ మహిళా పోలీస్ పద్మశ్రీతో కలిసి ఆమె చెంతకు చేరుకొని సపర్యలు చేశారు. చిన్నగా ఆమె ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకొన్నారు. పేరు, ఫోన్ నంబరు కనుకున్నారు. ఆమె బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెంకు చెందిన యాదగిరి నాగేశ్వరరావు భార్య దయామణిగా గుర్తించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి బాగోలేక దీనస్థితిలో ఇక్కడకు చేరుకున్నట్లు గుర్తించారు. బంధువులకు సమాచారం అందించి బంధువుల చెంతకు చేర్చారు. సచివాలయ ఉద్యోగుల సహకారాన్ని స్థానికులు అభినందించారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

బొల్లాపల్లి : రైతు భరోసా, పీఎం కిసాన్ పథకం వర్తించాలంటే రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏవో ఎ.అంకారావు తెలిపారు. ఈ వ్యవసాయ సీజన్‌కు సంబంధించి రబీ పంట సాగుకు 3వ విడతలో ఈ పథకంలో నగదు చెల్లించేందుకు ఈకేవైసీ అవసరమని తెలిపారు. మండలంలో 9100 మంది లబ్ధిదారులకు గాను 6900 పూర్తయ్యాయని, మిగిలిన 2వేల మంది రద్దయ్యాయని తెలిపారు. మిగిలిన 2వేల మంది లబ్ధిదారులు త్వరలో ఈకేవైసీ చేయించాలని తెలిపారు. పీఎం కిసాన్ వర్తించాలంటే ఈకేవైసీ తప్పనిసరి అని అన్నారు. రైతు భరోసా కేంద్రానికి వెళ్లి వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఈకేవైసీ చేయించుకోవచ్చని తెలిపారు. ఆధార్, పొలం పాస్‌పుస్తకం, రైతుకు సంబంధించిన వివరాలను సమర్పించాలని చెప్పారు.

చట్టాలపై అవగాహన ఏర్పరచుకోవాలి

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ మండల లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి ఎ.తౌషిద్‌హుస్సేన్ ఆదేశాల మేరకు స్థానిక రిటైర్డ్ ఎంప్లాయిస్ బిల్డింగ్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఆరె సామ్రాజ్యం మాట్లాడుతూ చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరికీ సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలని, చిన్నచిన్న తగాదాలకు పోలీస్‌స్టేషన్‌ల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరిగి తమ విలువైన సమయాన్ని, డబ్బును వృథా చేసు కోవద్దని అన్నారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ తాము తమ సర్వీసులో ఎంతో కష్టపడి సంపాదించుకున్న సొమ్ముతో స్థిరచరాస్తులు కొనుగోలు చేసే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఆస్తుల విషయంలో కుటుంబంలో గొడవలు రాకుండా ఎలా ఉండాలో తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతు పనులు ప్రారంభం

నాదెండ్ల: గ్రామీణ ప్రాంతాల్లో మరమ్మతులు అవసరమైన రోడ్లను శనివారం నుంచి మరమ్మత్తు పనులు ప్రారంభించారు. గణపవరంగ్రామ పరిధిలోని ఏఎంజీ వద్ద నుంచి సంకురాత్రిపాడు వరకూ 16 కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మత్తులు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రోడ్లు దెబ్బతిన్నాయి. అదీగాక గణపవరం మీదుగా బైపాస్ నిర్మాణ పనులు జరుగుతున్నందున భారీ వాహనాలు తిరగటంతో రోడ్లు మరింత దెబ్బతిన్నాయి.

ఆర్టీసీ డిపోలో డీజిల్ సప్లయ్‌కి టెండర్లు

వినుకొండ(నూజెండ్ల): ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ ఆదేశాల మేరకు వినుకొండ డిపో మేనేజర్ కార్యాలయం రిటైల్ అవుట్‌లేట్ల నుండి హైస్పీడ్ డీజిల్ ఆయిల్ (హెచ్‌ఎస్‌డీ)ను సరఫరా చేయడం కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ బి.కోటేశ్వరనాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ 7వేల లీటర్ల డీజిల్ సప్లయ్ చేయుటకు ఆసక్తి కలిగిన వారు ఈ నెల 23 నుంచి వచ్చే నెల 2వ తేదీ సాయంత్రం 5గంటల లోగా డిపో కార్యాలయంలో గల సీల్డ్ బాక్స్ నందు టెండర్లు వేయాలని సూచించారు. మార్కెట్ రిటైల్ ప్రైజ్ కంటే తక్కువ ధరకు అమ్మేవారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. వివరాలకు 9959225431, 7382898210 నంబర్లను సంప్రదించాలన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

యడ్లపాడు: పురుగు మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. యడ్లపాడు ఎస్సీకాలనీ (పైపల్లె)కు చెందిన కోడిరెక్క బాబు (55) కుమారుడు, కోడలు మూడు నెలల కిందట మృతి చెందారు. కుమారుడు లేడన్న మనస్తాపంతో బాబు ఈనెల 14వ తేదీన తన ఇంట్లో పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం వేకువ జామున మృతి చెందాడు. మృతునికి భార్య అరుణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.